రెండు గంటల్లోనే తల్లిదండ్రుల చెంతకు..

అదృశ్యమైన చిన్నారి

ఉప్పల్‌: అదృశ్యమైన రెండేళ్ల చిన్నారిని ఉప్పల్‌ పోలీసులు రెండు గంటల్లోనే తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఈ ఘటన ఉప్పల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ ఎలక్షన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్ట ప్రాంతానికి చెందిన మిరియంబీ (24) సోమవారం తన ఇద్దరు చిన్నారులతో కలిసి వచ్చి రామంతాపూర్‌ కేసీఆర్‌నగర్‌లోని బంధువుల ఇంటికి ఆటోలో వచ్చారు. ఈ క్రమంలో వారు ఆటో దిగుతుండగానే పెద్ద కుమారుడు ఆటో దిగి వెళ్లిపోయాడు. తల్లిదండ్రులు ఉదయం నుంచి వెతికినా ఆచూకీ లభించక పోవడంతో పోలీసులను ఆశ్రయించారు. దీంతో వారు చిన్నారి ఆచూకీ కోసం తీవ్రంగా శ్రమించి రెండు గంటల్లోనే బాలాజీ కాలనీలో చిన్నారిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.

సీఎం రిలీఫ్‌ఫండ్‌ చెక్కు పంపిణీ



గౌతంనగర్‌: ఇందిరానెహ్రూనగర్‌కు చెందిన ఆషర్‌ గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో నిమ్స్‌ ఆసుపత్రిలో ఇటీవల ఆర్థో, స్పెషల్‌ సర్జరీ ఆపరేషన్లు చేయించుకున్నాడు. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద దరఖాస్తు చేసుకోగా.. రూ.2 లక్షలు మంజూరయ్యాయి. మంజూరైన చెక్కును సోమవారం బాధిత కుటుంబానికి మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి అందజేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మల్లాపూర్‌: విశ్వ చైతన్య జూనియర్‌ కళాశాల 2000–2002 బ్యాచ్‌ విద్యార్థులు సోమవారం ఓయూలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 25 ఏళ్ల తరువాత చిన్ననాటి మిత్రులను కలవడంతో భావోద్వేగానికి లోనయ్యారు. ఒకరికొకరు అప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. అధ్యాపకులు కళాశాల ఫౌండర్‌ సుధీర్‌రెడ్డి, మధుసూదన్‌, వెంకట్‌, రమ్య, నిర్వాహకులు దయాకర్‌రెడ్డి, హరీక్యా, కార్తీక్‌, మహేష్‌, సుషాని, అంజలి, ఉదయ్‌, కిరణ్‌, రాజు, శంబూ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం - పచ్చదనం

- మొక్కలు నాటిన ప్రజా ప్రతినిధులు
- పర్యావరణాన్ని సంరక్షించాలని ప్రజలకు పిలుపు



స్వచ్ఛదనం, పచ్చదనంలో పాల్గొన్న కార్పొరేటర్‌ రాజ్యలక్ష్మి



చర్లపల్లి డివిజన్‌లో కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి, డీసీ ముకుంద్‌రెడ్డి



మేయర్‌ అజయ్‌యాదవ్‌, అడిషనల్‌ డైరెక్టర్‌ శ్యామ్‌ జాన్సన్‌



ఉప్పల్‌ డివిజన్‌లో కార్పొరేటర్‌ రజితాపరమేశ్వర్‌రెడ్డి



పచ్చదనం కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



మల్లాపూర్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



అల్వాల్‌లో కార్పొరేటర్‌ శాంతిశ్రీనివాస్‌రెడ్డి

మల్లాపూర్‌: స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌రెడ్డి, కాప్రా డీసీ ముకుంద్‌రెడ్డితో కలిసి మల్లాపూర్‌లో ప్రారంభించారు. హర్టికల్చర్‌ యూబీడీ మేనేజర్‌ లోకేష్‌, శ్రావణి, ఏఎంహెచ్‌వో వెంకటరమణ, ఏఎంసీ శానవజ్‌, ఆనంద్‌, వార్డు ఆఫీసర్‌ రాజుగౌడ్‌ తదితరులున్నారు.

మౌలాలి: వినాయక్‌నగర్‌ డివిజన్‌ పరిధిలో స్థానిక కార్పొరేటర్‌ రాజ్యలక్ష్మి ప్రారంభించారు. రాంకి దయానంద్‌, కమ్యూనిటీ ఆర్గనైజర్‌ రాములు, జవాన్‌ భాస్కర్‌, హర్టికల్చర్‌ వెంకటేష్‌, కాలనీ అధ్యక్షుడు అశోక్‌, ఓంప్రకాష్‌, సాయి, సురేష్‌, శ్రీకాంత్‌ ఉన్నారు.

సామాజిక బాధ్యతగా..

కుషాయిగూడ: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా బావించినప్పుడే స్వచ్ఛత, పచ్చదనం సాధ్యమవుతుందని కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి అన్నారు. సోమవారం కాప్రా సర్కిల్‌ డీసీ ముకుంద్‌రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. వార్డు ఆఫీసర్‌ సుధాకర్‌రావు, శానిటేషన్‌ సూపర్‌వైజర్‌ సుదర్శన్‌, గోపాల్‌రెడ్డి, లక్ష్మి, నరేష్‌, కాంగ్రెస్‌ నేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, గోపాల్‌యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంతోనే నగరాభివృద్ధి..

బోడుప్పల్‌: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం, పచ్చదనంతోనే నగరాభివృద్ధి సాధ్యమవుతుందని బోడుప్పల్‌ మేయర్‌ తోటకూర అజయ్‌యాదవ్‌ అన్నారు. బోడుప్పల్‌లో సోమవారం సీడీఎంఏ అడిషనల్‌ డైరెక్టర్‌ శ్యామ్‌జాన్సన్‌తో కలిసి ఆయన ర్యాలీలో పాల్గొన్నారు. కమిషనర్‌ రామలింగం, డిప్యూటీ మేయర్‌ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్‌, కార్పొరేటర్లు కొత్త దుర్గమ్మ, బొమ్మక్‌ సుగుణ, చీరాల నర్సింహ్మ, సుమన్‌నాయక్‌, మహేశ్వరి, జక్కల పద్మ తదితరులున్నారు.

మొక్కలు నాటండి...

అల్వాల్‌: మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అల్వాల్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం అల్వాల్‌ సర్కిల్‌ ఉపకమిషనర్‌ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆమె అల్వాల్‌ కొత్త చెరువు కట్టపై మొక్కలు నాటారు. ఏఎంహెచ్‌ఓ, మంజుల, వార్డు అధికారి స్వామి, ఎస్‌ఎఫ్‌ఏలు, జవాన్లు స్వచ్ఛతపై మాట్లాడారు.

ఉప్పల్‌లో..

ఉప్పల్‌: ఉప్పల్‌ సర్కిల్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో అధికారులు, స్థానిక కార్పొరేటర్‌ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి సర్కిల్‌ డీసీఆంజనేయులు, డీఈ చందనతో కలిసి మొక్కలు నాటారు.

- చిలుకానగర్‌ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్‌ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్‌ సర్కిల్‌ డీసీ ఆంజనేయులు, డీఈ చందన, శానిటరీ సూపర్‌వైజర్లతో కలిసి చిలుకానగర్‌లో మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు.



మొక్కలు పంపిణీ చేసిన కార్పొరేటర్‌ శ్రవణ్‌

జయప్రదం చేయండి..

మల్కాజిగిరి: స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని మల్కాజిగిరి, ఈస్ట్‌ ఆనంద్‌బాగ్‌ డివిజన్‌ కార్పొరేటర్లు శ్రవణ్‌, ప్రేమ్‌కుమార్‌లు పిలుపునిచ్చారు. కృపాకాంప్లెక్స్‌ వద్ద చెత్తను తొలగించి కార్పొరేటర్‌ శ్రవణ్‌ మొక్కలు నాటి, పంపిణీ చేశారు. పీవీఎన్‌కాలనీలో కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌ మొక్కలు పంపిణీ చేశారు. శానిటరీ సూపర్‌వైజర్‌ శ్రీనివాస్‌ తదితరులున్నారు.



కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ

రామంతాపూర్‌: రజక సంఘం వద్ద జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ ఉప్పల్‌ డిప్యూటీ కమిషనర్‌ ఆంజనేయులు ప్రారంభించారు.

అల్వాల్‌: మచ్చబొల్లారం డివిజన్‌లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్‌ రాజ్‌ జితేంద్రనాథ్‌, అల్వాల్‌ సర్కిల్‌ ఉపకమిషనర్‌ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. బొబ్బిలి సురేందర్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్‌, శ్రీనివాస్‌గౌడ్‌, లక్ష్మీకాంత్‌రెడ్డి, జ్యోతి, సీతగ్లోరీ తదితరులు పాల్గొన్నారు.



హబ్సిగూడలో కార్పొరేటర్‌ కక్కిరేణి చేతనాహరీష్‌



మొక్కలు నాటుతున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

నిత్య యోగా సాధనతోనే సంపూర్ణ ఆరోగ్యం



యోగా కేంద్రాన్ని ప్రారంభించిన డాక్టర్‌ ఎంపల్లి సృజన

కుషాయిగూడ: మారుతున్న జీవనశైలి, ఆహార అలవాట్ల దృష్ట్యా నిత్య యోగ సాధన, వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని డాక్టర్‌ ఎంపల్లి సృజన పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్‌, శివసాయినగర్‌ కాలనీలో ఏర్పాటు చేసిన 'యోగా అండ్‌ యూ' యోగ శిక్షణ తరగతులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడే కాకుండా మన ఆరోగ్యంపై దృష్టి సారిస్తే రోగాల బారిన పడకుండా ఉంటామన్నారు. దీనికి యోగాతో పాటు వ్యాయామం చేయడమే చక్కటి మార్గమన్నారు. శిక్షణ కేంద్రంలో వారం రోజుల పాటు నిర్వహించే ఉచిత యోగశిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా జీవించాలన్నారు. యోగ గురువు, రామ్‌శెట్టి, కాలనీ అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



మిర్జాల్‌గూడలో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్‌ నేతలు

గౌతంనగర్‌: ప్రజా సంక్షేమం కాంగ్రెస్‌ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్‌ పార్టీ గౌతంనగర్‌ డివిజన్‌ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్‌ అన్నారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు డివిజన్‌ పరిధిలోని మిర్జాల్‌గూడలోని చిన్మయ్‌ మార్గ్‌లో కొనసాగుతున్న సీసీరోడ్డు పనులను సోమవారం పరిశీలించారు. నాయకులు పీవీ. సత్యనారాయణ, ఫరీద్‌, వెంకట్‌, శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సహకారంతోనే ఆలయ పునర్నిర్మాణం



ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్‌ సునీతాశేఖర్‌యాదవ్‌

మౌలాలి: భరత్‌నగర్‌లో మహంకాళి దేవాలయ అభివృద్ధి, ఆలయ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావడం ప్రతి హిందువు కర్తవ్యమని మౌలాలి కార్పొరేటర్‌ సునీతాశేఖర్‌యాదవ్‌ అన్నారు. గత మూడేళ్లుగా మౌలాలి డివిజన్‌లోని పలు ఆలయాల నిర్మాణం, పునర్నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. భరత్‌నగర్‌ ఆలయ పునర్నిర్మాణంలో తనవంతు పాత్ర ఉండటం తమ పూర్వ జన్మ సుకృతమని కార్పొరేటర్‌ పేర్కొన్నారు. ఆలయాభివృద్ధి పనులు చివరి దశకు చేరుకున్న సందర్భంగా గణపతి పూజతో ప్రతిష్ఠాపన మొదలైందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు రాజేష్‌ యాదవ్‌, దుర్గేష్‌, సుధాకర్‌, మహేందర్‌, మహిళలు పాల్గొన్నారు.

ఆసరా పెన్షన్లు బ్యాంకులో జమ చేయాలని వినతి



మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బోడుప్పల్‌: బోడుప్పల్‌ నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పలువురు సీనియర్‌ సిటిజన్లు తమ పెన్షన్లు బ్యాంకు అకౌంట్‌, పోస్టాఫీస్‌ ఖాతాలో జమ చేయాలని కోరుతూ.. మేయర్‌ తోటకూర అజయ్‌యాదవ్‌, కమిషనర్‌ రామలింగం, డిప్యూటీ మేయర్‌ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆసరా పెన్షన్ల కోసం రోజంతా క్యూలో నిలబడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వయోభారం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. జీహెచ్‌ఎంసీలో మాదిరిగా బ్యాంక్‌ అకౌంట్‌లో వేసేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు వివరించారు. సామాజిక కార్యకర్త డాక్టర్‌ లక్ష్మి వీరమల్లు, సీనియర్‌ సిటిజన్లు సోమయ్య, కృష్ణ, ప్రసాద్‌, నర్సింగ్‌రావు, దశరథం, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాస్కెట్‌ బాల్‌ పోటీలు



ట్రోఫీతో విజేతలు

అల్వాల్‌: క్రిమ్సన్‌ ఇంటర్‌ స్కూల్‌ బాస్కెట్‌ బాల్‌ చాంపియన్‌షిప్‌ సీజన్‌–1 పోటీలు అల్వాల్‌లోని సెయింట్‌ మైఖెల్స్‌ స్కూల్‌లో ఘనంగా జరిగాయి. తెలంగాణ బాస్కెట్‌బాల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో నగరంలోని 17 పాఠశాలల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతి గేమ్‌ నాకౌట్‌–విజేతలు రౌండ్‌–1 నుంచి క్వార్టర్‌ ఫైనల్స్‌, సెమీస్‌తో పాటు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. మూడు రోజుల పాటు మొత్తం 19 మ్యాచ్‌లు జరిగాయని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. ఈ క్రీడల్లో అనేక అంతర్జాతీయ టోర్నమెంట్‌లో మనదేశానికి ప్రాతినిధ్యం వహించిన భారత జాతీయ బాస్కెట్‌బాల్‌ జట్టు మాజీ కెప్టెన్‌ మహ్మద్‌ రిజ్వాన్‌, సెయింట్‌ మైకెల్స్‌ పాఠశాల పూర్వ విద్యార్థి, తెలంగాణ జాతీయ జట్టు మాజీ కెప్టెన్‌ నాథస్‌ అబ్రహం, భారత సీనియర్‌ పురుషుల బాస్కెట్‌ బాల్‌ జట్టు మాజీ ప్రధాన కోచ్‌, తమిళనాడు సీనియర్‌ పురుషుల జట్టు, యంజీ యూనివర్సిటీ మహిళల జట్టు ప్రస్తుత ప్రధాన కోచ్‌ సీవీ. సన్నీ తదితరులు టోర్నమెంట్‌కు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ చాంపియన్‌షిప్‌లో డీఆర్‌ఎస్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌ చాంపియన్‌గా నిలవగా.. ఆర్మీ పబ్లిక్‌ స్కూల్‌ రన్నరప్‌గా నిలిచింది. ముగింపు కార్యక్రమంలో విజేత జట్టు చాంపియన్‌షిప్‌ ట్రోఫీ, పతకాలను అందుకుంది. క్రిమ్సన్‌ ఎడ్యుకేషన్‌ సీఈఓ హుసియన్‌ దోహద్వాల్లా తదితరులున్నారు.

ఆకట్టుకుంటున్న హస్తకళలు



హస్తకళ ఉత్పత్తులను పరిశీలిస్తున్న దృశ్యం

ఉప్పల్‌: ఉప్పల్‌ న్యూ భరత్‌నగర్‌లో కొమ్మిడి కృష్ణారెడ్డి గార్డెన్‌లో స్వదేశీ సేల్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వదేశీ హస్తకళల ఉత్పత్తుల ఎగ్జిబిషన్‌ ఆకట్టుకుంటోంది. అన్ని వయస్సుల వారి అభిరుచులకు అనుగుణంగా, ఆధునిక ఫ్యాషన్‌ డిజైన్లతో మహిళలను కట్టిపడేస్తోంది. జమ్మూకాశ్మీర్‌ ఎంబ్రాయిడరీ శారీస్‌, ధర్మవరం, వెంకటగిరి, గద్వాల, పోచంపల్లి పట్టు చీరలను సైతం సరసమైన ధరల్లో అందుబాటులో ఉన్నట్లు నిర్వహకులు పేర్కొన్నారు. డ్రెస్‌ మెటీరియల్స్‌ కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. హరియాణా బెడ్‌కవర్లు, కుషన్‌ కవర్లు, కుర్తీస్‌, పేయింటింగ్‌, హ్యాండీ క్రాఫ్టులను డిస్కౌంట్‌సేల్‌తో అందిస్తున్నట్లు ప్రకటించారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

మేడిపల్లి: ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ఓ మహిళ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి క్రాంతి కాలనీలో నివాసం ఉంటున్న రూప (35)గృహిణి. కాగా భర్త స్థానికంగా ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గత కొంతకాలంగా ఆర్థికఇబ్బందులతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యులు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేడిపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌదరిగూడ రామాలయ వీధికి చెందిన ఆంజనేయులు(35)డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం తన ద్విచక్రవాహనంపై చిలుకానగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లి, తిరిగి రాత్రి 10.30గంటలకు ఇంటికి వస్తుండగా.. ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యులు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించామన్నారు.

యువతి అదృశ్యం



ఉమారాణి

ఘట్‌కేసర్‌: యువతి అదృశ్యమైన సంఘటన ఘట్‌కేసర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. అడ్మిన్‌ ఎస్‌ఐ ప్రభాకర్‌రెడ్డి సమాచారం మేరకు... పట్టణంలోని గాంధీ నగర్‌కు చెందిన మంతపూర్‌ ఉమారాణి(19) కొంత కాలంగా స్థానికి కృష్ణ వస్త్ర దుకాణంలో పని చేస్తుంది. శనివారం రాత్రి కుటుంబ సభ్యులందరు భోజనం ముగించుకొని నిద్రపోయారు. ఉదయం లేచి చూసే సరికి ఉమారాణి కనిపించలేదు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారి ఇళ్లు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తల్లి అనిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రెచ్చిపోతున్న దొంగలు !

- గడిచిన నెలరోజుల్లో ఆరు దొంగతనం కేసులు
- ఐదు బైకులు, 13 తులాల బంగారం చోరీ
- సీపీకి ఫిర్యాదు చేసిన బాధితులు

కుషాయిగూడ: గడిచిన నెలరోజుల్లో జరిగిన ఆరు దొంగతనం కేసుల్లో ఐదు బైక్‌లు, 13 తులాల బంగారం చోరీకి గురయ్యాయి. బాధితులు పోలీస్‌స్టేషన్‌ చుట్టూ.. తిరిగిన సరైన సమాధానం రాలేదని వాపోయారు. దీంతో రాచకొండ సీపీ సుధీర్‌బాబును కలిశామని బాధితులు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే.. గతనెల 25న కుషాయిగూడ బస్‌స్టాండ్‌ సమీపంలో బట్టల వ్యాపారం చేసుకునే వ్యక్తి తిరుపతికి వెళ్లి వచ్చేలోగా ఇంట్లోని 13 తులాల బంగారాన్ని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈనెల 3న సాయినగర్‌ కాలనీలోని ఇంట్లో పార్కు చేసిన హోండా యాక్టీవా వాహనం చోరీకి గురైంది. అదేరోజు నాగార్జుననగర్‌ కాలనీలో నివాసం ఉంటున్న నాగ శ్రీనివాస్‌ ఇంటి ఎదుట నిలిపిన బైక్‌, అంతకు ముందు చక్రిపురంలో మరో బైక్‌ చోరీకి గురయ్యాయి. బాధితులంతా కుషాయిగూడ పోలీసులను ఆశ్రయించి, సీసీ పుటేజీలను సైతం అందజేశారు. పోలీసులు మీడియా, బాధితులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ఉంచుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సోమవారం బాధితులు రాచకొండ సీపీని కలిసి వినతిపత్రం అందజేశారు. కుమార్తె వివాహం కోసం కొనుగోలు చేసిన బంగారం దొంగల పాలయిందని, తమకు న్యాయం చేయాలని సీపీని కోరినట్లు సమచారం. దీనిపై కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్‌ అంజయ్యను వివరణ కోరగా.. బంగారం దొంగతనం కేసులో నిందితుడిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, ప్రస్తుతం అతడు గోవా పోలీసుల అదుపులో ఉన్నట్లు వివరించారు. నిందితుడి నుంచి 3 తులాల బంగారం రికవరీ చేశామని, చోరీకి గురైన బైక్‌లను కొంతమంది బాధితులకు అప్పగించామని తెలిపారు.

'పూడూర్‌ను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయొద్దు'



అడిషనల్‌ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

మేడ్చల్‌: మండలంలోని పూడూర్‌ గ్రామాన్ని హైదరాబాద్‌ మహనగర పాలక సంస్థ (జీహెచ్‌ఎంసీ)లో విలీనం చేయవద్దని గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌ కార్యాలయానికి వెళ్లి అడిషనల్‌ కలెక్టర్‌ నర్సింహారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. అలాగే మేడ్చల్‌ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పోచయ్య, స్రవంతి వెంకటేష్‌, సుగుణమ్మ, రఘు, నాయకులు సంజీవరెడ్డి, కృష్ణశేఖర్‌రెడ్డి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఆ మూడు గ్రామాలను యాదాద్రిలో కలుపొద్దని వినతి

ఘట్‌కేసర్‌: అవుషాపూర్‌, అంకుషాపూర్‌, మాదారం గ్రామాలను యాదాద్రి జిల్లాలో కలుపొద్దని కోరుతూ జేఏసీ నాయకులు సోమవారం వినతి అందజేశారు. ఓఆర్‌ఆర్‌ బయట ఉన్న ఆరు గ్రామాలను మండలంగా ఉంచాలని, లేదంటే మున్సిపాలిటీ ఏర్పాటు చేయాలన్నారు. అదీ కాదంటే ఘట్‌కేసర్‌ మున్సిపాలిటీలో కలపాలని అఖిల పక్ష నాయకులు ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ వజ్రేశ్‌యాదవ్‌, అదనపు కలెక్టర్‌ శ్యాంసన్‌కు వినతి పత్రాలను సమర్పించారు. నాయకులు కొండల్‌రెడ్డి, ప్రవీణ్‌రావు, శోభారాణి, ఐలయ్యయాదవ్‌, గోపాల్‌రెడ్డి, భిక్షపతిగౌడ్‌, మాధవరెడ్డి, వామన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, రాజుగౌడ్‌, వెంకట్‌రెడ్డి, కష్ణగౌడ్‌, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల సంఘం జిల్లా చైర్‌పర్సన్‌గా హసీనా



నియామకపత్రాన్ని అందజేస్తున్న సక్కు దానియేల్‌

పోచారం: జాతీయ మానవ హక్కుల సామాజిక న్యాయ సంఘం మేడ్చల్‌ మల్కాజిగిరి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా నారపల్లికి చెందిన షేక్‌ హసీనా నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని సంఘ జాతీయ ఉపాధ్యక్షుడు సక్కు దానియేల్‌ సోమవారం ఆమెకు అందజేశారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వేణు మాధవ్‌, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు శీలం సరస్వతి, జిల్లా అధ్యక్షుడు మహ్మద్‌ ఇబ్రహీం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జితేందర్‌ సింగ్‌ రాణా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ మాజీ కౌన్సిలర్‌ మృతి




నివాళులర్పించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



వెంకటేష్‌ (ఫైల్‌)

కుషాయిగూడ: మీర్‌పేట్‌–హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నేత, మాజీ కౌన్సిలర్‌ జలగం వెంకటేష్‌ గుండెపోటుతో మృతి చెందారు. ఆధ్యాత్మిక చింతనతో పాటు కాంగ్రెస్‌లో చాలా ఏళ్లుగా చురుకైన నేతగా ఉన్న ఆయన సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్‌ పార్టీ ఉప్పల్‌ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి, చర్లపల్లి కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి, మాజీ కార్పొరేటర్లు శ్రీనివాస్‌రెడ్డి, గొల్లూరి అంజయ్య, పలువురు కాంగ్రెస్‌ నేతలు, అభిమానులు ఆయనకు నివాళులర్పించారు.

'ప్రజాపాలన'లో సమస్యల పరిష్కారానికి కృషి



అల్వాల్‌ సర్కిల్‌ డీసీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అల్వాల్‌: ప్రజాపాలనలో అందిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అల్వాల్‌ సర్కిల్‌ ఉపకమిషనర్‌ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రతి సోమవారం ప్రజా పాలనలో భాగంగా అల్వాల్‌ పట్టణ ప్రజలు వివిధ సమస్యలపై ఇచ్చిన ఫిర్యాదులను ఆయన సోమవారం సర్కిల్‌ కార్యాలయంలో స్వీకరించారు. మచ్చబొల్లారం డివిజన్‌ శ్రీసాయి సూర్య ఎన్‌క్లేవ్‌ కాలనీవాసులకు కేటాయించిన పార్కు స్థలం అన్యాక్రాంతం కాకుండా దళారుల నుంచి స్థలాన్ని పరిరక్షించి, అంతర్గత రోడ్లు వేయాలని కోరారు. ప్రజా సమస్యలను పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని డీసీ హామీ ఇచ్చారు. కాలనీ అధ్యక్షుడు నర్సింగరావు, రాజిరెడ్డి, సబ్బారావు, రాజేందర్‌రావు తదితరులున్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్‌ భాగ్యలక్ష్మి

మల్లాపూర్‌: మల్లాపూర్‌ సెక్టార్‌ పరిధిలోని నెహ్రూనగర్‌, అశోక్‌నగర్‌ అంగన్‌వాడీ సెంటర్లలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌ భాగ్యలక్ష్మి హాజరై తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. చిన్నారులు పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. ఆరో నెల నుంచి రెండేళ్ల వరకు తల్లిపాలతో పాటు అదనపు పౌష్టికాహారం ఇస్తే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు జానకీ, గాయత్రి, రామేశ్వరి, ఆశావర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.